ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★ ఆదివారం 22 సెప్టెంబరు 2024



సన్నాలపై మక్కువ



- జిల్లాలో రికార్డు స్థాయిలో సన్న రకం వరి సాగు
- 2,09,562 ఎకరాల్లో 1,72,879 ఎకరాల సన్నాలే!
- ఈ సీజన్ నుంచే క్వింటాలుకు రూ. 500
- ప్రభుత్వంపై రూ. 178.92 కోట్ల భారం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో రైతులు ఎక్కువగా సన్న రకం వరి పంటనే సాగుచేశారు. ఈ సీజన్ నుంచి 32 సన్న రకాల వరిసాగు చేసే రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలో మున్నెన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో సన్నాలను సాగు చేశారు. సన్నాలను కొనుగోలు చేయడం వల్ల ప్రభుత్వంపై అదనంగా 178 కోట్ల 92 లక్షల రూపాయల భారం పడనున్నది. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2,09,562 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, ఇందులో దొడ్డు రకం వరి 36,676 ఎకరాల్లో సాగు చేయగా, సన్న రకం 1,72,879 ఎకరాల్లో సాగు చేశారు. అంటే 78.79 శాతం సన్న రకం పంటను సాగు చేశారు. గతంలో సన్న రకం వరి ధాన్యం సాగు 35 శాతానికి మించలేదు. ఈసారి రికార్డు స్థాయిలో సన్నాలను రైతులు పండిస్తున్నారు. ఎక్కువగా బీపీటీ, సాంబమసూరి, జైశ్రీరాం, చిట్టి ముత్యాలు తదితర రకాల వరి ధాన్యాన్ని సాగు చేశారు.

జిల్లా వ్యాప్తంగా సాగు చేసిన వరి సాగు వల్ల 4 లక్షల 49 వేల 554 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని, ఇందులో దొడ్డు రకం 91 వేల 700 టన్నులు, సన్న రకం 3 లక్షల 97 వేల 615 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. సన్న రకం ధాన్యం దిగుబడిలో 10 శాతం తిండి అవసరాలకు పోనూ 3 లక్షల 57 వేల 853 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం కేంద్రాలకు వస్తే మాత్రం క్వింటాలుకు 500 రూపాయల చొప్పున 178 కోట్ల 92 లక్షల రూపాయల బోనస్ భారం ప్రభుత్వంపై పడనున్నది. ఈ ఏడాదికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల ప్రకారం కామన్ రకం వరి ధాన్యం క్వింటాలుకు 2300 రూపాయలు కాగా, గ్రేడ్ ఏ రకం 2,320 రూపాయలు. అయితే సన్న రకం ధాన్యాన్ని కామన్ గ్రేడ్ కిందనే తీసుకుంటున్నారు. దీంతో చాలా మంది రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే ఎక్కువగా బహిరంగ మార్కెట్‌లోనే విక్రయించుకుంటున్నారు. ఈసారి సన్న రకం సాగు పెరగడంతో బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండనున్నది. ప్రభుత్వమే క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇవ్వనుండడంతో 2,800 రూపాయలు రానున్నాయి. ఎకరానికి 20 క్వింటాళ్ల ధాన్యాన్ని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే 10 వేల రూపాయలు రానున్నాయి. ఈ లెక్కలను అంచనా వేసే రైతులు జిల్లాలో అధికంగా సన్నరకం ధాన్యాన్ని పండిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు 2800 రూపాయలకు పైగా ధర పలికితేనే వారికి విక్రయించేందుకు మొగ్గు చూపుతారు. లేదంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 147 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడులు రానున్నాయని, ఇందులో 80లక్షల టన్నుల ధాన్యం కేంద్రాలకు రానున్నదని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. రైతులకు బోనస్ ఇచ్చేందుకు 2,500 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయిస్తూ శుక్రవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

● జనవరి నుంచే రేషన్ కార్డులపై సన్న బియ్యం..

రేషన్ షాపుల ద్వారా సన్న రకం బియ్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వం రైతులతో సన్న రకాలను ప్రోత్సహిస్తున్నది. వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన సన్న రకం పంటను క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇచ్చి కొనుగోలు చేయనున్నది. ఆ ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లింగ్ చేసి నిల్వ చేయనున్నారు. వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డులపై ఇచ్చే బియ్యాన్ని సన్నవి ఇవ్వనున్నారు. ఇప్పటివరకు దొడ్డు రకం బియ్యం ఇస్తున్నారు. ఈ బియ్యాన్ని తీసుకుంటున్న వినియోగదారులు వందకు 60 శాతం మంది ఆ బియ్యాన్ని బయట మార్కెట్‌లో విక్రయించుకుంటున్నారని గమనించిన ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తేనే వాటిని తిండి అవసరాలకు వినియోగించుకోనున్నారని, ప్రజలపై బియ్యం భారం పడకూడదని సన్న రకం వరి ధాన్యం సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది.

జిల్లాలోని మండలాల వారీగా వరి సాగు వివరాలు (ఎకరాల్లో)

క్రసం.	మండలం	దొడ్డు రకం	సన్న రకం	మొత్తం
1.	కమాన్‌పూర్	34	7039	7073
2.	మంథని	31	21791	21822
3.	ముత్తారం	17	11395	11412
4.	రామగిరి	0	10935	10935
5.	ఎలిగేడు	1155	11781	12937
6.	జూలపల్లి	5000	8389	13390
7.	ఓదెల	6593	14311	20905
8.	పెద్దపల్లి	118	28389	28508
9.	శ్రీరాంపూర్	816	18466	19282
10.	సుల్తానాబాద్	7588	15917	23505
11.	అంతర్గాం	1287	3986	5273
12.	ధర్మారం	13279	9845	23125
13.	పాలకుర్తి	755	8255	9010
14.	రామగుండం	5	2375	2380
	మొత్తం	36676	172879	209562

రేపు రేషన్‌షాపుల్లో మహాలక్ష్మి ప్రొసీడింగ్స్ పంపిణీ

మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

మంథని, సెప్టెంబరు 21: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం కార్యక్రమం ద్వారా కేవలం రూ.500లకే గ్యాస్ సిలెండర్‌ను అందించాలనే లక్ష్యంలో మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్ రెడ్డి వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మంథని మున్సిపల్ పరిధిలోని రేషన్‌షాపుల్లో అర్హులైన లబ్ధిదారులకు మహాలక్ష్మి ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తామన్నారు. తొలుత మంథనిలో రేషన్‌షాపు నంబర్ 17,18,19,20,21,23,25,38,42లలో సోమవారం పంపిణీ చేస్తారన్నారు. మిగితా వారికి తర్వాత ఇస్తామన్నారు. ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులు తీసుకోవాలని కోరారు. స్థానిక 13 వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్ రెడ్డి శనివారం ప్రారంభించారు. కౌన్సిలర్లు గుండా విజయలక్ష్మి-పాపారావు, కొట్టె పద్మ-రమేష్, చొప్పకట్ల హన్మంతలు పాల్గొన్నారు. స్థానిక కాకతీయ హైస్కూల్‌లో స్వచ్ఛతా సేవా కార్యక్రమంలో భాగంగా చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ వీకే రవి, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

'పట్టభద్రులకు అండగా నిలిచే వారినే ఎన్నుకోవాలి'

పెద్దపల్లి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో గ్రాడ్యుయేట్ల సమస్యలపై గళం విప్పే వారినే ఎన్నుకోవాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆశావహుడు ప్రసన్న హరికృష్ణ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ చేయడం వల్ల నిరుద్యోగులకు న్యాయం జరగడం లేదని, నిరుద్యోగులపై అవగాహన ఉండడంతోపాటు జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించగల సత్తా ఉండాలన్నారు. ఎంతోమంది నిరుద్యోగులకు ఉచితంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశానని ప్రస్తుతం అవసరం ఉన్నవారు సైతం తనకు ఫోన్ చేస్తే పంపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్రెపల్లి మాజీ సర్పంచ్ వడాల అజయ్ గౌడ్, స్టూడెంట్ జేఏసీ జిల్లా కోకన్వీనర్ నుర శ్యామ్, రవీందర్, రాజేష్, నరేష్, కమలాకర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు

మంథనిరూరల్, సెప్టెంబర్ 21: గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని మంథని సీఐ రాజు అన్నారు. శనివారం మండలంలోని గుంజపడుగు గ్రామంలో రామగుండం కమీషనర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సీఐ రాజు, ఎస్ఐ రమేష్‌ల ఆధ్వర్యంలో గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలతో సమావేశం నిర్వహించి గ్రామంలో పరిస్థితి అడిగితెలుసుకున్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి వాటికి జరిమానా విధించారు. ఎస్ఐ రమేష్ సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామగిరి, ముత్తారం ఎస్ఐలు చంద్రకుమార్, నరేష్ పాల్గొన్నారు.

చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలి : డీపీవో



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 21: గ్రామాల్లో సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని డీపీవో వీరబుచ్చయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కాల్వశ్రీరాంపూర్, ఓదెల గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీపీఓ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సేకరించిన చెత్తను సెగ్రిగేషన్‌కు తరలించి కంపోస్ట్ ఎరువును తయారుచేయాలన్నారు. ప్రతినెల గ్రామ పంచాయతీ విద్యుత్‌చార్జీలు చెల్లించాలన్నారు. గ్రామపంచాయతీ సిబ్బందికి సకాలంలో జీతాలు ఇవ్వాలన్నారు. ఇంటిపన్నులు సకాలంలో వసూలు చేసి ట్రెజరీ కార్యాలయంలో జమచేయాలన్నారు. గ్రామంలో మంచినీటి లీకేజీ ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. 1,11,21తేదీలలో మంచినీటి ట్యాంకులను తప్పకుండా శుభ్రంచేయించాలని సూచించారు. వృత్తి, వ్యాపార లైసెన్సులు, గృహాల నిర్మాణ అనుమతులు సకాలంలో ఇవ్వాలన్నారు. గ్రామస్థుల ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించాలన్నారు. స్వచ్ఛత సేవ కార్యక్రమంలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు పంచాయతీకార్యదర్శులు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. గ్రామ పంచాయతీ ఓటర్ల లిస్టు అంశాల గురించి వివరించారు. డీపీవో వీరబుచ్చయ్య కాల్వశ్రీరాంపూర్‌కు మొదటిసారిగా వచ్చిన సందర్భంగా సంబంధిత అధికారులు, గ్రామకార్యదర్శులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో వేణుగోపాల్, స్వచ్ఛభారత్ మిషన్ కోఆర్డినేటర్ రాఘవులు, ఎంపీడీవోలు రామ్మోహనచారి, షబ్బీర్ పాషా, ఎంపీవో గోవర్ధన్ గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దపల్లి, జూలపల్లి మార్కెట్ కమిటీల ఖరారు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



ఈర్ల స్వరూప | కూర మల్లారెడ్డి | గండు సంజీవ్ | కొమ్ము పోచాలు

పెద్దపల్లి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పెద్దపల్లి, జూలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాలను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సిఫార్సుల మేరకు ఈ కమిటీలు ఏర్పడ్డాయి. పెద్దపల్లి కమిటీ చైర్మన్‌గా ఈర్ల స్వరూప, వైస్‌చైర్మన్ కూర మల్లారెడ్డి నియమితులయ్యారు. డైరెక్టర్లుగా కొమ్ము కరుణాకర్, సోమ చంద్రయ్య, మేడగోని శ్రీనివాస్, కొలిపాక కనుకయ్య, వేగోళపు పెద్ద రాజేశం,పిట్టల కొమురయ్య, ఎండీ గౌస్ మియా, కొల్లూరి రాంచంద్రం, తిప్పారపు ప్రభాకర్, ఎం నరోత్తంరెడ్డి, ఎడ్ల మహేందర్, పీఏసీఎస్ పొత్కపల్లి చైర్మన్, జిల్లా మార్కెట్ శాఖ అధికారి, పెద్దపల్లి ఏడీఏ, మున్సిపల్ చైర్ పర్సన్‌లు ఉంటారు.

● జూలపల్లి చైర్మన్ గండు సంజీవ్..

జూలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గండు సంజీవ్, వైస్‌చైర్మన్‌గా కొమ్ము పోచాలు, డైరెక్టర్లుగా కందుకూరి అంజయ్య, ఉట్కూర్ల సమ్మయ్య, మల్లారపు సంతోష్ కుమార్, మంద రమేష్, జక్కుని శంకరయ్య, గంగిపల్లి చుక్కయ్య, లోక రాజిరెడ్డి, కోరుకంటి అంజమ్మ, పొన్నం రమేష్, మల్లెత్తుల కొమురయ్య, పీఏసీఎస్ చైర్మన్ ధూళికట్ట, జిల్లా మార్కెట్ శాఖ అధికారి, పెద్దపల్లి ఏడీఏ, జూలపల్లి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి ఉంటారు. తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే విజయరమణారావు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల పంటలకు మద్దతు ధరలు దక్కే విధంగా కృషి చేస్తామని నూతనంగా నియమితులైన చైర్మన్లు ఈర్ల స్వరూప, గండు సంజీవ్ అన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



పెద్దపల్లిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు



జూలపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 21 : తెలంగాణ ఉద్యమ పితామహుడు కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా పద్మశాలి సేవా సంఘం అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు వలస నీలయ్య పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్ సమీపంలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడెపు సుధాకర్, చేనేత వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిపల్లి సదానందం, అడ్‌హక్ కమిటీ సభ్యులు డివిఎస్ మూర్తి, పెగడ చందు, జిల్లా ఉపాధ్యక్షులు గుండేటి రాజేష్, సుల్తానాబాద్, పెద్దపల్లి మండలాల అధ్యక్షులు చిపక భాస్కర్, గుండా మురళి, కామణి రాజేశం, కొండి సతీష్ కుమార్, మామిడి కనకరాజు, ఆడెపు శంకరయ్య, కొండబత్తుల మల్లేశం, ఆడెపు కనకయ్య, దిడ్డి సత్యనారాయణ, అడిచెర్ల లక్ష్మణ్, దిడ్డి రాజయ్య, బూర్ల ధనుంజయం, తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి : మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం నాయకుల ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ పోరాటయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మన్‌బాపూజి చిత్రపటానికి పూలమాలలువేసి కొవ్వొత్తులతో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు మెరుగు రమేష్, భైరి భూమయ్య, మెరుగు కనుకయ్య, సాంబారి అంజనేయులు, పలువురు.

కమాన్‌పూర్ : తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు శనివారం మండల కేంద్రంలో పద్మశాలి సేవా సమితి ఆధ్వర్యంలో మంథని నియోజకవర్గ కన్వీనర్ తాటికొండ శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కొండా లక్ష్మణ్ బాపూజి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మచ్చగిరి రామ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొమ్మగాని అనిల్, సీలం శ్రీనివాస్, బీసీ సంఘం మండల ఉపాధ్యక్షుడు తోట రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు కుక్క రవీందర్, ఎలబోయిన రామ్మూర్తి, జంగపల్లి శ్రీనివాస్, ఆటో యూనియన్ అధ్యక్షుడు మెట్ట నరసయ్య, మాజీ వార్డు సభ్యులు దాసరి రామచంద్రం, సుంచు శ్రీనివాస్, కాసరవి, బొంపల్లి మల్లేష్, తాటిపల్లి శ్రీనివాస్, మట్ట రాజయ్య, పవన్ కల్యాణ్, కందుల నరసయ్య, సాగర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ : కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని మున్సిపల్ కార్పొరేషన్ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు బండారి రాయమల్లు అన్నారు. ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక మార్కండేయ కాలనీలోని బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో పాల్గొన్న బాపూజీ తెలంగాణ సాధన కోసం చేసిన కృషి మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో బూర్ల దామోదర్, దినేష్, మౌనిక, రజిత, స్రవంతి, వేణు పాల్గొన్నారు. 42వ డివిజన్ కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మార్కండేయ కాలనీలోని కొండ లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో చిప్ప రాజేశం, ఆడెపు శంకర్ పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్ : గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురలో శనివారం స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమకారుడు కొండ లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ అబ్దుల్ రహమాన్ కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జీడీ కనకయ్య, ఎం.ఆర్‌కె శ్రీనివాసులు, నరేష్, శారద, జగదీశ్వరి, భాగ్యలక్ష్మి, కళారాధా, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



కమాన్‌పూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్ సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలతో తప్పుడుగా వ్యవహరిస్తున్న ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీఎస్ జనార్థన్ రావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలలో పని చేస్తున్న పి సదానందం, అబ్దుల్ ఖాదర్ అనే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు 6వ తరగతి చదువుతున్న బాలికలతో తప్పుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఇటీవల పాఠశాలకు వెళ్లగా ఒక ఉపాధ్యాయుడు అందుబాటులో ఉండడంతో దేహశుద్ధి చేశారు. మరొక ఉపాధ్యాయుడు ఆ రోజు పాఠశాలకు హాజరు కాలేదు. ఈ వ్యవహారంపై ఇద్దరు ఉపాధ్యాయులపై పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదయ్యింది. దీనిపై విచారణ జరిపిన డీఈవో కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అవినీతికి పాల్పడ్డ మంథని బిల్ కలెక్టర్ సస్పెన్షన్

పెద్దపల్లి, మంథని సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణ నేపథ్యంలో మంథని మున్సిపాల్టీలో బిల్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ బిల్ కలెక్టర్ రాజు అవినీతికి పాల్పడుతున్నారని పట్టణవాసి సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్ ఈనెల 19న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇంటిపన్ను 50వేలు పెండింగ్ ఉన్న నేపథ్యంలో పునఃపరిశీలించాలని బిల్ కలెక్టర్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్ సంప్రదించారు. 25 వేల రూపాయలు చెల్లించాలని చెప్పారని, 14 వేల రూపాయల నగదు, ఫోన్ పే ద్వారా 11వేలు చెల్లించిన తర్వాత ఇంటిపన్ను రసీదు కోరగా, 647 రూపాయలకు మాత్రమే ఇంటిపన్ను రశీదు అందించారని అఫ్రోజ్ పేర్కొన్నారు. దీని పై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. డబ్బులు తీసుకుని అవినీతికి పాల్పడింది నిజమేనని తేలడంతో బిల్ కలెక్టర్ రాజును సస్పెండ్ చేస్తూ, హెడ్ క్వార్టర్ వదిలివెళ్లవద్దని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కార్పొరేషన్ కమిషనర్‌గా జేసీకి అదనపు బాధ్యతలు..

కోల్‌సిటీ, సెప్టెంబరు 21: రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్‌గా అదనపు కలెక్టర్ అరుణశ్రీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత కమిషనర్‌గా ఉన్న సీహెచ్ శ్రీకాంత్ ఈనెల 19 నుంచి 24వ తేది వరకు సెలవుపెట్టారు. శ్రీకాంత్ బదిలీయత్నాల్లో ఉండడంతో ఆయన సెలవులో వెళ్లినట్టు తెలుస్తోంది. మొదట ఎస్ఈ శివానంద్‌కు బాధ్యతలు ఇచ్చిన కలెక్టర్ పాలనపరమైన వ్యవహారాల దృష్ట్యా అదనపుకలెక్టర్ అరుణశ్రీకి బాధ్యతలు అప్పగించారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ఫైవింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 21: మండల లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం న్యూమారేడుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ జిల్లా, సెషన్ జడ్జి శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల స్థాయి నుండి క్రమశిక్షణతో మెలగాలని, పుస్తకాలకే పరిమితం కాకుండా క్రీడలు సామాజిక సేవలో విద్యార్థులు పాల్గొనడం అలవర్చుకోవాలని సూచించారు. చట్టాలు, రాజ్యాంగం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సీఐ ప్రసాదరావు, హెచ్ఎం స్వర్ణ, న్యాయవాది భూమయ్య, సామాజిక కార్యకర్త మిట్టపల్లి శంకర్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలలో సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జూనియర్ సివిల్ జడ్జి డి గణేష్ హాజరై మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఏదైనా సమస్య వచ్చినప్పుడు దగ్గరలోగల లీగల్ సర్వీసెస్ సెల్ సంప్రదించడం లేదా లెటర్ రాయగలిగితే న్యాయ సహాయం దొరుకుతుందని తెలిపారు. అనంతరం మెజిస్ట్రేట్‌ను కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక, ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, మహిళా అధ్యాపకులు సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడాల శ్రీరాములు, జనరల్‌సెక్రెటరీ రమేష్, ఏజీపీ ఆవుల లక్ష్మీరాజం, లోక్ అదాలత్ సభ్యులు పబ్బతి లక్ష్మి కాంతరెడ్డి, ఆలూరి శ్రీనివాసరావు, జోగుల రమేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 21: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో గర్భిణులకు అందే వైద్య సేవలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ రివ్యూ నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో గర్భిణుల నమోదు తక్కువగా ఉందని, సూపర్‌వైజర్ మానిటరింగ్ చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫీవర్ సర్వేలో ఎక్కువ జ్వరాలు నమోదైన గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి సహకారంతో ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె ప్రమోద్‌కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఏడీపీహెచ్‌వో డాక్టర్ అన్నప్రసన్న, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఏసీపీ

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 21: గోదావరిఖనిలోని ప్రభుత్వ పాఠశాల, అశోక్‌నగర్‌లోని జెడీహెచ్ఎస్ పాఠశాలలను శనివారం ఏసీపీ ఎం.రమేష్ సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, పోషకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిల్లలు కూడా ఏదైనా సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

సన్మాన సభను విజయవంతం చేయండి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 21: హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో ఈనెల 27న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో జరిగే ఉద్యమకారుల ఘన సన్మాన కార్యక్రమానికి ఉద్యమకారులు, కళాకారులు పెద్దఎత్తున తరలిరావాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాక తొలి, మలిదశ ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు అందరికీ ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ 250 గజాల ఇంటి స్థలాన్ని అందరికీ వర్తింపచేయాలని, కేవలం ఎఫ్ఐఆర్ ఉన్న వాళ్లకి కాకుండా ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపి నష్టపోయిన ఉద్యమకారులను కూడా గుర్తించి అందరికీ న్యాయం చేయాలని కోరారు.

ఎమ్‌స్వాస్థ్ ఆధ్వర్యంలో వైద్య సేవలు

- రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా గంభీరావుపేటలో ఏర్పాటు

గంభీరావుపేట, సెప్టెంబరు 21: గ్రామీణ ప్రాంత ప్రజలకు డిజిటల్ వైద్య సలహాల్లో భాగంగా ఎమ్ స్వాస్థ్ ఆధ్వర్యంలో ప్రాథమిక వైద్య సేవలను అందించే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో మొదటగా గంభీరావుపేటలో నాబార్డు, సింగిల్ విండోల సహకారంతో ఏర్పాటు చేసినట్లు నాబార్డు రీసోర్స్ పర్సన్ షరీఫ్, నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రారంభించారు. గంభీరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో నాబార్డు ద్వారా ఏర్పాటు చేసిన ఈ క్లినిక్ శనివారం ఎమ్ స్వాస్థ్ సౌత్ ఇండియా మార్కెటింగ్ రీజినల్ హెడ్ శరత్ చంద్రతో కలిసి నాబార్డు రీసోర్స్ పర్సన్ షరీఫ్, నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావులు ప్రారంభిం చారు. ఒక్కో కుటుంబం నుంచి 365 రూపాయలు చెల్లిస్తే ఏడాది పాటు ఉచితంగా వైద్య సేలు అందిస్తామని అన్నారు. 400 మంది వైద్యులు ఆన్‌లైన్‌లో సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

మానకొండూర్, సెప్టెంబరు 21: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు సూచించారు. మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజర వ్వాలన్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించడమే కాకుండా బాషలో నైపుణ్యం సాధించాలని చెప్పారు. దీర్ఘకాలంగా పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం మధుసూదనాచారి, జిల్లా సమన్వయకర్త ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

గన్నేరువరం, సెప్టెంబరు 21: మండలంలోని చీమలకుంటపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండీ పాషాను కలెక్టర్ శనివారం సస్పెండ్ చేశారు. పాషా రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో సరైన ధ్రువపత్రాలు లేనప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చాడని, మ్యుటేషన్‌లు చేశాడని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టగా అక్రమాలు జరిగినట్లు గుర్తించడంతో కలెక్టర్ సస్పెండ్ చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గంగాధర, సెప్టెంబరు 21: గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామశివారు పరిధిలో వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఉప్పరమల్యాల శివారులో గుర్తు తెలియని సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి బావిలో మృతి చెంది ఉన్నాడని సమాచారం రావడంతో పరిశీలించామని చెప్పారు. మృతుడు నీలిరంగు ప్యాంటు, టీ షర్టు ధరించి ఉన్నాడని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కోటి రూపాయలతో ఇద్దరు పరారీ..?

హుజూరాబాద్, సెప్టెంబరు 21: హుజూరాబాద్ ప్రాంతంలో అప్పులు చేసిన ఇద్దరు వ్యక్తులు కోటి రూపాయలు చెల్లించకుండా పరారవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని ఓ హోటల్ నిర్వాహకుడు 15రోజుల క్రితం రూ. 50లక్షలతో పరారీ కాగా, రెండు రోజుల క్రితం రంగాపూర్ గ్రామానికి చెందిన డెకరేషన్లు చేసే వ్యక్తి రూ. 50లక్షల రూపాయలు అప్పులు చెల్లించకుండా ఉడాయించాడు. వీరు ఇద్దరు ఏళ్లగా నమ్మకంగా వ్యాపారం చేసుకుంటుండడంతో కొంత మంది తమ వద్ద ఉన్న డబ్బులను వడ్డీ ఆశతో అప్పుగా ఇచ్చారు. వీరిద్దరూ పరారీ కావడంతో వారి ఆచూకీ కోసం బాధితులు గాలిస్తున్నారు. రెండు నెలల క్రితం ఓ బేకరి దుకాణం యజమానితో పాటు సూపర్‌బజార్ రోడ్‌లో చిట్టీలు నడి పే వ్యక్తి కూడా రూ. 1.50కోట్ల రూపాయలు అప్పులు చెల్లించకుండా పరారయ్యాడు. వరసగా నలుగురు పరారీ కావడం పట్టణంలో చర్చనీ యాంశమైంది.

మహిళ బంగారు నగలు చోరీ

చొప్పదండి, సెప్టెంబరు 21: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన మహిళ ఆరు తులాల బంగారు నగలను దుండగులు చోరీ చేశారు. ఎస్‌ఐ అనూష తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి రాధ ఆరు తులాల బంగారం చొప్పదండిలోని యూనియన్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టడానికి శనివారం వచ్చింది. బ్యాంక్‌లో బంగారం కవర్ పెట్టి జిరాక్స్ కోసం బయటకు వెళ్లింది. తిరిగి వచ్చి చూడగా బంగారు నగలు ఉంచిన కవర్ కనిపించలేదు. రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బందనకల్ శివారులో పేకాటరాయుళ్ల అరెస్టు

ముస్తాబాద్, సెప్టెంబరు 21: మండలంలోని బందనకల్ శివారులో పేకాట రాయుళ్ల స్థావరం దాడి చేసినట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ శనివారం తెలిపారు. సమాచారం మేరకు బందనకల్ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేయగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నా రు. మరో ఆరుగురు పరారు అయ్యారని తెలిసింది.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. ఎస్సారెస్పీలోకి 8,502 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 8,502 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


బి పల్లవి | మణిచరణ్ | శశాంక్

చొప్పదండి, సెప్టెంబరు 21: ఎస్‌జీఎఫ్ఐ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నవోదయ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీల్లో ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో బి పల్లవి, శశాంక్, మణిచరణ్ జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను, పీఈటీ రాధికను ప్రిన్సిపాల్ మంగతయారు శనివారం అభినందించారు. ఎంపికైన విద్యార్థులు నవోదయ విద్యాలయ జట్టు తరుపున జాతీయ స్థాయి హ్యాండ్ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ మంగతయారు తెలిపారు.

భవితకు నవోదయం

- పీఎంశ్రీ స్కూల్స్‌గా జవహర్ నవోదయ విద్యాలయాలు - పేరు మార్చిన కేంద్ర విద్యాశాఖ - విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యం

చొప్పదండి, సెప్టెంబరు 21: ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత భోజన వసతితో అత్యుత్తమ విద్యను అందిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు జవహర్ నవోదయ విద్యాలయాలు పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) స్కూల్స్‌గా మారాయి. కేంద్ర విద్యాశాఖ ఈ మేరకు మార్పు చేసింది. తమిళనాడు మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని 661 నవోదయ విద్యాలయాలు పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయాలుగా మార్పు చేశారు. ప్రస్తుతం ప్రతీవిద్యార్థికి ఇస్తున్న లక్ష రూపాయల బడ్జెట్‌కు అదనంగా మరో 20 వేల రూపాయలను పెంచనున్నట్లు సమాచారం. నవోదయ విద్యాలయాలు ఏర్పడిన 38 ఏళ్ల తరువాత పేరు మారడం విశేషం. కాగా నవోదయ విద్యాలయంలో ప్రస్తుతం ప్రతీ విద్యార్థిపై కేంద్ర ప్రభుత్వం ఏడాదికి లక్ష రూపాయలను ఖర్చు పెడుతోంది. పీఎం శ్రీ స్కూల్స్‌లో దీనికి తోడుగా మరో 20 వేల రూపాయల బడ్జెట్‌ను పెంచుతున్నట్లు సమాచారం. అదనపు నిధులతో విద్యార్థుల కోసం సైన్స్ సోషల్, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్ లను ప్రతీ విద్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ ల్యాబ్‌లు ఎంతో దోహద పడుతాయి.

● గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం..

దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ 1985లో అప్పటి అస్సాం రాష్ట్రంలోని మారుమూల గ్రామం లో పర్యటించే సమయంలో చదువు లేని చిన్నారులను గమనించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థు లకు విద్యను అందించేందుకు ఏదైనా చేయాలనే సంకల్పంతో ఢిల్లీకి తిరిగి వచ్చిన వెంటనే అప్పటి మానవవనరులశాఖ మంత్రి పీవీని పిలిచి చర్చించారు. దీంతో పీవీ నవోదయ విద్యాలయాలకు నాంది పలికారు. రాజీవ్‌గాంధీ సుముఖత వ్యక్తం చేయడంతో 1986లో పైలట్ ప్రాజెక్టుగా దేశంలో రెండు నవోదయ విద్యాలయాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లా చొప్పదండిలో నవోదయ విద్యాలయాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం పేరు మార్పుతో అదనపు బడ్జెట్ సమకూరనుంది. దీంతో అభివృద్ధి దిశలో పయనించేందుకు నవోదయ విద్యాలయాలు ముస్తాబవుతున్నాయి. విద్యాలయంలో 80 సీట్లకు గాను 75 శాతం మేరకు 60 సీట్లను గ్రామీణ విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 20 సీట్లను పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో 15 శాతం ఎస్సీలకు, 7.5 శాతం ఎస్టీలకు, మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో మూడింట ఒక వంతు సీట్లను బాలికలకు రిజర్వ్ చేస్తారు. సీబీఎస్ఈ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించి మార్కులు, మెరిట్ కేటగిరి ఆధారంగా ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

- వేములవాడ ప్రైవేట్ అద్దె గదిలో పురుగుల మందు తాగిన రేగొండ వాసి


కరుణాకర్‌రెడ్డి(ఫైల్)

వేములవాడ, సెప్టెంబరు 21: వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ అద్దె గదిలో పొన్నాల కరుణాకర్‌రెడ్డి (38) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రానికి చెందిన పొన్నాల కరుణాకర్‌రెడ్డి గత మంగళవారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. శనివారం వేములవాడ జాత్రా గ్రౌండ్‌లోని ఓ ప్రైవేటు అద్దె గదిలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అతడిని చికిత్స కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పౌల్ట్రీ వ్యాపారం చేసే కరుణాకర్ రెడ్డికి కరోనాకాలం నుంచి తీవ్ర నష్టాలు రావడంతో మూడు కోట్ల వరకు అప్పులైనట్లు బంధువుల ద్వారా తెలిసింది. కరుణాకర్‌రెడ్డి ఏప్రిల్‌లోనూ ఇంటి నుంచి వెళ్లిపోయి నెలరోజుల తర్వాత ఇంటికి చేరుకున్నాడు. మళ్లీ అప్పుల బాధలు తీవ్రమవడంతో మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడని బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని, బంధువులు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జి కృష్ణ

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 21: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గత గురువారం జరిగిన హత్యకు సంబంధించిన నేరస్తుడిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఏసీపీ గజ్జి కృష్ణ వెల్లడించారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన రిటైర్డు సింగరేణి ఉద్యోగి కలవేన లక్ష్మయ్య తన భార్య ఇద్దరు కొడుకులతో మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం తీగల్‌పహాడ్‌లో నివాసముంటున్నాడు. అతనికి ఇద్దరు తమ్ముళ్లు కలవేన రాజయ్య, మల్లయ్యలు గ్రామంలోనే తమకున్న భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి దగ్గరి బంధువైన కలవేన రాజేశం(68) రిటైర్డు రైల్వే ఉద్యోగి భూముల వీరి పక్కపక్కనే ఉన్నాయి. ఇక్కడే ఉంటూ సాగు చేసుకుంటున్నాడు. పదిహేనేళ్లుగా వీరి మధ్య భూతగాదాలున్నాయి. పెద్దల సమక్షంలో పంచాయతీలు నిర్వహించగా, కోర్టులోనూ కేసులు కొనసాగుతూనే ఉన్నాయి. కలవేన లక్ష్మయ్య, ఇద్దరు తమ్ముళ్లు రాజయ్య, మల్లయ్యలు ఈ క్రమంలో కలవేన రాజేశంపై కక్ష పెంచుకున్నారు. తరచూ జరిగే ఈ భూవివాదం, కోర్టు కేసుల నుంచి విముక్తి పొందడానికి రాజేశంను కడతేర్చేందుకు పథకం వేశారు.

ఈనెల 19న రాజేశం తన భూమిని కొలిపిస్తున్నాడన్న సమాచారం తెలుసుకున్నారు. అదును చూసి హత్య చేసేందుకు ముగ్గురు అన్నదమ్ములు సిద్ధమయ్యారు. తన భూమి వద్ద పని చేసుకొని రాజేశం ఇంటికి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ముగ్గురన్నదమ్ములు మాటు వేసి ఉన్నారు. రాజేశంతో కొంత సమయం పాటు కేసులు విరమించుకోవాలని వాగ్వాదానికి దిగారు. మరోవైపు రాజేశం తలపై లక్ష్మయ్య కర్రతో బలంగా బాదాడు. అలాగే పలుమార్లు బాదడంతో రాజేశం అక్కడికక్కడే మృతిచెందాడు. ముగ్గురు అక్కడినుంచి పారిపోయారు. మృతుడి కుమారుడు సాయికృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసుకోగా, సీఐ ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నేరస్థుడు లక్ష్మయ్య గ్రామంలోనే ఉన్నాడన్న సమాచారంతో అదుపులోకి తీసుకుని విచారించగా ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలిపాడు. మల్లయ్య, రాజయ్యలు పరారీలో ఉన్నారని, హత్యకు ఉపయోగించిన కర్ర, మోటార్‌సైకిల్, రక్తపు దుస్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. త్వరలో పరారీలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుంటామన్నారు.

బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

- ఇప్పటికే రామగిరిలో-1, మంథనిలో-3 కేసులు

మంథని, సెప్టెంబరు 21: బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న మంథని మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సత్యనారాయణ అలియాస్ సతీష్‌ను త్వరలోనే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని మంథని సీఐ రాజు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మంథని పోలీసుస్టేషన్‌లో శనివారం తాజాగా ఫిర్యాదు రావడంతో ఇనుములపై మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు బెదిరింపులు, అక్రమ వసూళ్లకు సంబంధించి మంథని పోలీసు సేషన్‌లో మూడు, రామగిరి పోలీసుసేషన్‌లో ఇనుముల సతీష్‌పై ఒక కేసు నమోదైనట్లు తెలిపారు. పలు కేసుల్లో ఇనుముల సత్యనారాయణకు సహకరించిన రావికంటి సతీష్‌ను ఇప్పటికే అరెస్టు చేసి జైలు పంపించామన్నారు. స్థానిక కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బెల్లంకొండ రవీందర్‌రెడ్డిని రెండు లక్షల రూపాయలు ఇవ్వాలని మంథని మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సత్యనారాయణ బెదిరించగా అతను సత్యనారాయణకు లక్ష రూపాయలు ఇచ్చాడన్నారు. మరో లక్ష రూపాయలు కూడా ఇవ్వాలని లేకపోతే ఆస్తి, ప్రాణనష్టం కలిగిస్తానని సత్యనారాయణ పలుసార్లు బెదిరించినట్లు తెలిపారు. గతంలో బాధితుడు భయపడి ఫిర్యాదు చేయలేదని, ఇప్పుడు ఫిర్యాదు చేయడంతో సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంథని ప్రాంతంలో ఇంకా ఇనుముల సత్యనారాయణ బాధితులు ఉంటే పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గణపతి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు, లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇద్దరు వ్యక్తులకు నాలుగు రోజుల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 21: మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన కేసులో ఇద్దరు వ్యక్తులకు నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి కరుణాకర్ శనివారం తీర్పు వెలువరించారు. జగిత్యాల జిల్లాలోని కోడిమ్యాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన వడ్లకొండ నాగభూషణం, మెట్‌పెల్లికి చెందిన గుండేటి మధుసూదన్ అనే ఇద్దరు అతిగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రామచంద్రంకు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఎస్సై కేసు నమోదు చేసి ఇద్దరిని కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికి నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని కోరారు.

సిమెంట్ దిమ్మె కూలి గిరిజన మహిళ మృతి


మృతిచెందిన బానోతు లక్ష్మి

వీర్నపల్లి, సెప్టెంబర్ 21: ఉపాధిహామీ పథకం సమాచారాన్ని తెలిపేందుకు ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మె కూలి గిరిజన మహిళ మృతి చెందిన ఘటన వీర్నపల్లి మండలం సీతారాం నాయక్ తండా గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బానోతు లక్ష్మి (58) తమకున్న పశువులతో మేతను మేపేందుకు అడవిలోకి వెళ్లింది. మధ్యాహ్న సమయంలో ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో సిమెంట్ దిమ్మె పక్కన సేదతీరేందుకు కూర్చుంది. అదే సమయంలో గేదెలు పోట్లాడుకుంటూ దిమ్మెకు తగలడంతో ఒక్కసారిగా ఆమెపై విరిగిపడింది. సిమెంట్ ఇటుకలు ఆమెకు బలంగా తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సాయంత్రం అటునుంచి పశువులను తీసుకెళ్తున్న గిరిజనులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలికి భర్త రాఘజి, కుమారులు సంతోష్, రమేష్ ఉన్నారు. పోలీసులు సంఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, సెప్టెంబరు 21: ధర్మపురిలో భాద్రపద మాసం శనివారం భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. భక్తులు అభిషేకం, కుంకుమార్చన, స్వామివారల నిత్య కల్యాణం, నరసింహ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు పాల్గొన్నారు.

● సంకటహర చతుర్థి పూజలు..

రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

● యమ ధర్మరాజు ఆలయంలో అభిషేకం..


యమ ధర్మరాజు ఆలయంలో శనివారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య అర్చకులు స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం నిర్వహించారు.

● కొండగట్టు అంజన్న సన్నిధిలో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు కొండపైకి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బేతాళుడు, రాములవారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

'మిడ్ మానేరు' పనులపై విజిలెన్స్ విచారణ

- ఎల్ఎండీలోని ఇరిగేషన్ సర్కిల్-1లో రికార్డులు స్వాధీనం


రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబరు 21: మిడ్ మానేరు రిజర్వాయర్ పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నారు. దీనిలో భాగంగా శనివారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ సర్కిల్-1, కాళేశ్వరం సర్కిల్-1 కరీంనగర్ కార్యాలయానికి నలుగురు విజిలెన్స్ అధికారుల బృందం ఉదయం వచ్చి సాయంత్రం వరకు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్(డీఎస్ఈ) అస్మత్ అలిని కలిసిన విజిలెన్స్ అధికారులు మిడ్ మానేరు ప్రాజెక్టు పనులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించాలని కోరారు. కాళేశ్వరం సర్కిల్-1 కార్యాలయంలో డీఎస్ఈ వెంకటయ్యను కలిసిన విజిలెన్స్ అధికారులు కాళేశ్వరం పరిధిలోని లింకు-3, ప్యాకేజీ-9 పరిధిలోని మల్కంపేట్ రిజర్వాయర్‌కు సంబంధించిన ఫైళ్లు అడిగి తీసుకొని పరిశీలించినట్లు సమాచారం. మిడ్‌మానేరు రిజర్వాయర్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు దానికి సంబంధించిన ఫైళ్లు తీసుకున్నట్లు సమాచారం. ఆయా ప్రాజెక్టు అంచనాలు కాలపరిమితి, పొడిగించిన కాలపరిమితి వివరాలు, టెండర్ ప్రక్రియ, బిల్లుల రికార్డులు, చెల్లింపులు, కాంట్రాక్టర్లు, అధికారుల వివరాలను విజిలెన్స్ అధికారులు కోరారు. ఆయా ప్రాజెక్టు పనుల్లో భాగంగా అప్పటినుంచి ఇప్పటివరకు విధులు నిర్వహించిన ఇంజనీర్ల పూర్తి సమాచారం అడిగి తీసుకుంటున్నట్లు తెలిసింది. కార్యాలయంలోనే ఫైళ్లు, అగ్రిమెంట్లు ఇతర డాక్యుమెంట్లు పరిశీలించిన విజిలెన్స్ అధికారులు అనుమానం ఉన్న ఫైళ్ళను వెంట తీసుకువెళ్లినట్లు తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఏఈ శశిధర్, శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు

జ్యోతినగర్, సెప్టెంబరు 21: రామగుండం ఎన్‌టీపీసీలో ఉమ్మడి జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఎన్‌టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో పాల్గొనాలని, క్రీడల ద్వారా శారీరక, మానసిక దారుఢ్యం పెరుగుతుందని అన్నారు. పాఠశాల దశ నుంచి ఏదైనా ఒక క్రీడల్లో ప్రావీణ్యం పొందేలా సాధన చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 100 మంది చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీపీసీ సీజీఎం సింగరాయ, అధికారులు, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు

రేపు అండర్-19 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 21: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉమ్మడి జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయ నెట్స్‌లో ఉదయం 8 గంటలనుంచి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేస్ అధ్యక్ష, కార్యదర్శులు విఆగమ్‌రావు, ఎన్ మురళీధర్‌రావు తెలిపారు. 2005 సెప్టెంబరు1 తరువాత జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు క్రికెట్ యూనిఫామ్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్ రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంఘం ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, కె మహేందర్‌గౌడ్‌కు రిపోర్టు చేయాలని తెలిపారు.

పోత్గల్ శివారులో చిరుత కలకలం

ముస్తాబాద్, సెప్టెంబరు 21: మండలంలోని పోత్గల్ శివారులో చిరుత కనిపించిందని జోరుగా ప్రచారం జరగడంతో ముస్తాబాద్, పోత్గల్ గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు శనివారం భయాందోళనకు గురయ్యారు. పోత్గల్ దారిలోని రైస్‌మిల్ పక్కన మానేరు కెనాల్ నుంచి పోత్గల్ రామాలయం వైపు వెళ్తుండగా ఒర్రె వద్ద ఒక చిరుత, రెండు పిల్లలను చూసినట్లు ఓ రైతు చెప్పడంతో కలకలం నెలకొంది. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై గణేశ్ గ్రామస్థులతో వచ్చి పులి అడుగులను పరిశీలించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. పులి అడుగులు పెద్దగా ఉంటాయని అయినా రెండు రోజులు జాగ్రత్తగా ఉండాలని బీట్ ఆఫీసర్ రమేశ్ పేర్కొన్నారు.


పరిశీలిస్తున్న ఎస్సై గణేశ్, తదితరులు

అథ్లెటిక్స్‌లో చాంపియన్‌షిప్ సాధించిన కరీంనగర్ జిల్లా జట్టు


ట్రోఫీతో అథ్లెటిక్స్ క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్ సెప్టెంబరు 21: రాష్ట్రస్థాయి అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌ను జిల్లా క్రీడాకారులు సాధించారు. హైదరాబాద్‌లో ఈనెల 19,20 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు.

ఈ పోటీల్లో ఎం వినయ్ మూడు వేల మీటర్ల పరుగులో బంగారు, మూడువేల మీటర్ల స్టీపుల్ చేస్‌లో కాంస్య పతకం సాధించారు. విష్ణువర్ధన్ 10వేల మీటర్ల రేస్‌వాక్‌లో బంగారు పతకం, స్వామి జావలిన్‌త్రో, డిస్కస్‌త్రోలలో బంగారు పతకాలు, సంతోష్, 5వేల మీటర్ల పరుగులో బంగారు పతకం, విక్రమ్‌కుమార్ షాట్‌పుట్‌లో కాంస్య పతకం సాధించి రాష్ట్ర చాంపియన్లుగా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కోచ్ తిరుపతి, వరుణ్‌లతో పాటు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌గౌడ్ క్రీడాకారులను అభినందించారు.

అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా పొన్నం రవిచంద్ర



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21: స్పెయిన్ దేశంలోని బార్సిలోనా పట్టణంలో జరగనున్న 31వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు, ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా సదరన్ రీజియన్ అసిస్టెంట్ జెనరల్ సెక్రెటరీ డాక్టర్ పొన్నం రవిచంద్ర ఎంపికయ్యారు. ఈ ఏడాది నవంబరు 14 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న ఈ చిత్రోత్సవానికి స్పెయిన్ నుంచి లోర్డేశ్ ఫెక్సియా, నార్వే నుంచి విలియం సవేరేసెన్, ఇండియా నుంచి పొన్నం రవిచంద్రలను జ్యూరీ సభ్యులుగా నియమిస్తూ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా సదరన్ రీజియన్ కార్యదర్శి టీఎస్ఎస్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. రవిచంద్ర గతంలో నంది సినిమా అవార్డుల జ్యూరీ సభ్యునిగా, పోర్చుగల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ సభ్యుడిగా పని చేశారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

- పాల్గొన్న 19 బాలికల, బాలుర జట్లు


సాఫ్ట్ బాల్ ఆడుతున్న క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 21: తెలంగాణ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలబాలికల క్రీడా పోటీలు శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ప్రారంభం అయ్యాయి. తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లాల నుండి 19 బాలికలు జట్లు, 19 బాలుర జట్లు వచ్చాయి. శనివారం నుండి సోమవారం వరకు మూడు రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మొట్ట మొదటి సారిగా జరుగుతున్న సాఫ్ట్ బాల్ పోటీలను తిలకించడానికి స్థానిక ప్రజలు ఆశక్తి చూపుతూ క్రీడా మైదానం వస్తున్నారు. మొదటి రోజు తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీలను నిర్వాహకులు ఎలాంటి ఆట్టహాసం లేకుండా, ముఖ్య అతిథులు ఎవరిని ఆహ్వానించకుండా సాదాసీదాగా ప్రారంభించారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సభ్యులు, జట్ల కోచ్‌లు, మేనేజర్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టు కార్మికులకు హై పవర్ వేతనాలు ఇవ్వండి

- కేంద్ర మంత్రిని కలిసిన జనక్ ప్రసాద్



కేంద్ర మంత్రి మన్సుక్ మాండవియను సన్మానిస్తున్న జనక్ ప్రసాద్

గోదావరిఖని, సెప్టెంబరు 21: కోల్ ఇండియాలో మాదిరిగా సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా హై పవర్ వేతనాలు చెల్లించాలని రాష్ట్ర కనీస వేతన మండలి సలహా చైర్మన్ జనక్ ప్రసాద్, కేంద్ర కార్మిక ఉపాధిశాఖ మంత్రి మన్సుక్ మాండవియను కోరారు. హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర మంత్రిని శనివారం జనక్ ప్రసాద్ కలిసి కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని, శ్రమకు తగిన వేతనం రావడం లేదని కేంద్ర మంత్రికి జనక్ ప్రసాద్ తెలిపారు. సింగరేణిలో హై పవర్ వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రామగుండంలో ఈఎస్ఐసీ ఆసుపత్రి అన్ని పర్మిషన్లు ఉన్నప్పటికీ నిర్మాణానికి నోచుకోవడం లేదని, అందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాలపై కేంద్రం నుంచి సానుకూలంగా స్పందించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో జనక్ ప్రసాద్‌తో పాటు ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, క్యాంపెనింగ్ ఇన్‌చార్జి వికాస్ కుమార్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్ఎస్ రాజు ఉన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును సన్మానించిన జనక్ ప్రసాద్

సింగరేణిలో పని చేస్తున్న 25వేల మంది కాంట్రాక్టు కార్మికులకు సంస్థ లాభాల్లో బోనస్ ఇప్పించడం చారిత్రాత్మకమైందని అందుకు కృషి చేసిన ఐటీ శాఖమంత్రి శ్రీధర్‌బాబును ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ సన్మానించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన జనక్ ప్రసాద్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 21: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఈనెల 30న తలపెట్టిన చలో హైదరాబాద్ పోస్టర్‌ను శనివారం ఆర్జీ-2 హౌస్ కీపింగ్ సెక్షన్‌లో సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు అశోక్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మేరీ, శారద, లింగయ్య, లక్ష్మి, భాగ్యలక్ష్మి, రాజమణి, పద్మ, సదానందం పాల్గొన్నారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసిన జీఎం



నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, సెప్టెంబరు 21: సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా ఆర్జీ-1 పరిధిలో ఎంపికైన 17మంది వారసులకు కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులను శనివారం జీఎం కార్యాలయంలో జీఎం లలిత్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, సీఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ రావుల దామోదర్, ఏఐటీయూసీ నాయకులు రాజు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీఓ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పెద్దపల్లిటౌన్ : భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాల ని శనివారం కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె విశ్వనాథ్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జి రాములు, జిల్లా సహాయ కార్యదర్శి ని పెల్లి రవీందర్ జిల్లా కమిటీ సభ్యులు సావన పెల్లి వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : మండలంలోని రేగడిమద్దికుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 24న సుల్తానాబాద్, ఓదెల, ఎలిగేడు, జూలపల్లి మండలాల బాలబాలికలకు మంగళవారం 14,17 సంవత్సరాల విభాగంలో కబడ్డీ, వాలీబాల్ ఆటలలో సుల్తానాబాద్ జోనల్ లెవెల్ టోర్నమెంట్ నిర్వహించబడుతుందని పీఈటీ దాసరి రమేష్ శనివారం తెలిపారు. అలాగే 25న బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బాలబాలికలకు ఖోఖో, అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు జరుగుతాయని,వివరాలకు 9490674874 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

కాల్వశ్రీరాంపూర్ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా మహేష్ కుమార్‌గౌడ్ పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ శనివారం గాంధీభవన్‌లో మహేష్ కుమార్‌గౌడ్‌ను సన్మానించారు. ఎమ్మెల్యే విజయరమణారావు సహాయ సహకారాలతో మహేష్ కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినట్లు సారయ్యగౌడ్ తెలిపారు.

పెద్దపల్లిటౌన్ : రైతుల విద్యుత్తు సమస్యల పరిష్కారం కోసం పొలంబాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పెద్దపల్లి సర్కిల్ ఎస్ఈ బొంకూరి సుదర్శన్ పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అయితే వ్యవసాయదారులు వెంటనే 1912 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ముత్తారం : మండలానికి మెడికల్ హెల్త్ సబ్ సెంటర్ కోసం రూ20 లక్షలు మంజూరుచేసిన మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీనుబాబుకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం కృతజ్ఞతలు తెలిపారు.

కళ్యాణ్‌నగర్ : లయన్స్‌క్లబ్ ఆఫ్ రామగుండం మగువ అధ్యక్షురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో 39వ డివిజన్ ప్రగతినగర్‌లో వైద్యురాలు లక్ష్మీవాణి శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సభ్యులు టీనాసింగ్, పద్మ, వనజరాపోల్ పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్ : సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలంటూ ఈ నెల 23 చేపట్టిన చలో సంక్షేమ భవన్ హైదరాబాద్ ముట్టడిని విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపెల్లి అశోక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయంలో ముట్టడి కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం అశోక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీపీ ఎస్ జిల్లా అధ్యక్షుడు మొదుంపల్లి శ్రావణ్, నాయకులు కుమ్మరి నవీన్, గద్దల శేఖర్,అశోక్, రమేష్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ : అటవీ ఉద్యోగుల కాళేశ్వరం జోనల్ స్థాయి క్రీడలు శనివారం ప్రగతి మైదానంలో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆదివారం సైతం క్రీడలు కొనసాగుతాయి. ఈ క్రీడల్లో కబడ్డీ, టగ్‌ఆఫ్ వార్, క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల నిర్వహించనున్నారు. జోన్ పరిధిలోని భూపాలపల్లి, ములుగు, కుమ్రం భీం-ఆసిఫాబాద్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఉద్యోగులు ఇందులో పాల్గొంటున్నారు.

లాభాల వాటా 16శాతమే ఇచ్చారు

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, సెప్టెంబరు 21: రెండున్నర దశాబ్దాలుగా సింగరేణి సంస్థను వరుసగా లాభాల బాటలో నడిపిస్తున్న కార్మికులను యాజమాన్యం, రాష్ట్రప్రభుత్వం మోసంచేసిందని టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కార్మికులు 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి రూ.4,071కోట్ల నికర లాభం ఆర్జిస్తే అందులో 33శాతం కార్మికులకు రూ.1550కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. కానీ రూ.2,412కోట్లలో 33శాతం లాభాల వాటా రూ.796కోట్లు ఇస్తున్నామని చెప్పడం ఒక వంచన అని అన్నారు. ఇది 16శాతం మాత్రమే లాభాలవాటా చెల్లింపు అవుతుందని, వచ్చిన లాభాల్లో రూ.2,289కోట్లు సింగరేణి భవిష్యత్ అవసరాల కోసం పక్కనపెట్టడం వెనుక ఏం మతలబు ఉందని ప్రశ్నించారు. ప్రతి కార్మికుడికి రూ.4లక్షల లాభాల వాటా రావాల్సి ఉండగా రూ.2లక్షలు ఇప్పించి గొప్పలు చెప్పుకుంటున్న గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘం కార్మికులకు జవాబు చెప్పాలన్నారు. కార్మికులకు జరిగిన ఈ ఆర్థిక నష్టంపై కలిసి వచ్చే సంఘాలతో పోరాటాలు చేస్తామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు మాదాసు రామమూర్తి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, పొలాడి శ్రీనివాస్, వాసర్ల జోసెఫ్, చల్లా రవీందర్‌రెడ్డి, బొగ్గు సాయి, రాజ్‌కుమార్, వల్లె సురేందర్, జనగామ మల్లేష్, పులిపాక శంకర్, రొడ్డ సంపత్, సందీప్ పాల్గొన్నారు.

లాభాల వాటాపై కార్మికుల్లో అసంతృప్తి..

- సీఐటీయూ జనరల్ సెక్రటరీ నరసింహారావు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 21: గత ఏడాదితో పోల్చితే సింగరేణి అధిక లాభాలు ఆర్జించినా కార్మికులకు ఇచ్చే వాటా మాత్రం అతి తక్కువగా ఉండడంతో కార్మిక వర్గంలో అసంతృప్తి నెలకొన్నట్లు సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ మంద నరసింహారావు పేర్కొన్నారు. శనివారం ఓసీపీ-3 కృషిభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాదితో పోల్చితే సింగరేణి లాభాలు రెండింతలు పెరిగాయని, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4701 కోట్ల ఆదాయం రాగా సంస్థ విస్తరణకు 2289 కోట్లు కేటాయించినట్లు ప్రకటించినట్లు తెలిపారు. మిగిలిన 2412 కోట్ల లాభాల్లో 33శాతం(795.96 కోట్లు) కార్మికులకు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి అభివృద్ధికి కేటాయిస్తున్నట్టు చెప్తున్న 2289కోట్లు ఎంతవరకు వాస్తవమో కార్మిక వర్గానికి తెలిసేలా శ్వేతపత్రం విడుదల చేయాలని నరసింహారావు డిమాండ్ చేశారు. ఈ గేట్‌మీటింగ్‌లో ఆర్జీ-2 సెక్రెటరీ కుంట ప్రవీణ్, నాయకులు వినయ్, ఉల్లి మొగిలి, సారంగం, వినేష్, సంపత్, రాంప్రసాద్, నరసింహ, భూమయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా కొత్త హక్కు

ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

గోదావరిఖని, సెప్టెంబరు 21: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా భాగస్వామ్యాన్ని కొత్తగా సాధించిన హక్కుగా సాధించామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ ఉత్పత్తిలో కాంట్రాక్టు కార్మికుల భాగస్వామ్యం కూడా ఉందని, వాళ్లకు ప్రకటించిన లాభాల బోనస్ రూ.5వేలే అయినప్పటికీ అది సింగరేణి చరిత్రలో కొత్త హక్కు అని అన్నారు. నికర లాభాల్లో 33శాతం వాటాపై కొన్ని కార్మిక సంఘాలు చేస్తున్న ప్రచారం దురదృష్టకరమన్నారు. గత సంవత్సరం కూడా రూ.4వేల కోట్ల లాభం వస్తే రూ.2200కోట్లలో 32శాతం మాత్రమే కార్మికులకు లాభాల వాటాగా చెల్లించారని గుర్తు చేశారు. ఒక శాతం లాభాల వాటా పెంచడంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల్లో వాటా ఇప్పించామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు చెల్లించే లాభాలబోనస్ మొత్తం కూడా సింగరేణి లాభాల్లో నుంచే చెల్లిస్తుంది తప్ప సింగరేణి కార్మికులకు ప్రకటించిన 33శాతం వాటా నుంచి కాదన్నారు. అలాగే వరద బాధితుల సహాయంకు సింగరేణి కార్మికుల ఒక్క రోజు మూల వేతనం సీఎం నిధికి అందజేసినప్పటికీ సుమారు రూ.10కోట్ల ఆ డబ్బును సింగరేణి కార్మికుల వేతనాల్లో యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఫలితంగా సింగరేణి కార్మికులకు రూపాయి నష్టం జరుగదన్నారు. ఈ అంశాన్ని కూడా పలు కార్మిక సంఘాలు రాజకీయం చేస్తున్నాయని, గతంలో ప్రతి కార్మికుడు సంతకం పెడితే మాత్రమే విరాళాలు ఇవ్వలేదని, ఈ అంశాలను అనవసరంగా రాద్ధాంతం చేయరాదని సీతారామయ్య సూచించారు. విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

'కార్మికులకు ప్రాణాలతో చెలగాటమాతున్న యాజమాన్యం'

గోదావరిఖని, సెప్టెంబరు 21: సింగరేణిలో కార్మికులకు భద్రత లేదని, కార్మికుల ప్రాణాలతో యాజమాన్యం చెలగాటం ఆడుతున్నట్టు భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కార్యదర్శి ప్రభాత్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు మీడియాకు ప్రభాత్ ప్రకటన విడుదల చేశారు. శ్రీరాంపూర్ ఇందారం 1ఏ గనిలో శ్రీనివాస్, మందమర్రి కేకే-5 గనిలో లక్ష్మణ్ అనే ఇద్దరు కార్మికులు ఇటీవల గనిలో జరిగిన ప్రమాదాలతో మృతిచెందారని, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభాత్ డిమాండ్ చేశారు. అధికారులు, యూనియన్ నాయకులు, డీజీఎంఎస్ అధికారులు కుమ్మక్కై ప్రమాద కారకులను వదిలి కార్మికులపై నెపం వేస్తున్నారని తెలిపారు. ప్రమాదాలపై డీజీఎంఎస్ విచారణ సక్రమంగా జరగడం లేదని, అధికారులను బాధ్యులుగా చేయకుండా కాపాడే విధంగా విచారణ తంతు జరుగుతున్నట్టు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం చేపట్టాల్సిన రక్షణ చర్యలను వదిలి అధికారులు సేఫ్టీ వ్యక్తిగత బాధ్యతగా చిత్రీకరిస్తున్నట్టు తెలిపారు. ఉత్పత్తి ధ్యేంగా యాజమాన్యం రక్షణ విషయంలో పూర్తి నిర్లక్షం వహిస్తున్నదన్నారు. యూనియన్ నాయకులు ఫ్రీమస్టర్లు పొందుతూ, డిప్యుటేషన్ పేరిట అయామ్ లేని వారిని సర్వీస్‌కు పంపిస్తూ కొందరు యూనియన్ నాయకులు అధికారులకు ఊడిగం చేస్తున్నారని ప్రభాత్ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల్లో జరిగిన ప్రమాదాల్లో మరణించిన కార్మిక కటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రమాదాలకు కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభాత్ డిమాండ్ చేశారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తాం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 21: కార్మికులకు ఇచ్చిన ఆరు హామీలను అమలు చేస్తామని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్‌ప్రెసిడెంట్ ధర్మపురి తెలిపారు. శనివారం యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజులుగా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి మెరుగైన లాభాల వాటా సాధించామన్నారు. పెర్క్స్‌పై ఐటీ రీయింబర్స్‌మెంట్, సొంత ఇంటి పథకం అమలు వంటివి అమలు అయ్యేలా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. సత్యనారాయణరెడ్డి, దాను, అక్బర్‌అలీ, అక్రం, దశరథం, సంపత్‌రెడ్డి, సురేష్, అవి నాష్, రాయమల్లు, అనిల్, రవి, అనంత రాములు పాల్గొన్నారు.

ఓసీపీ-2లో ఐఎన్‌టీయూసీ సంబరాలు

రామగిరి, సెప్టెంబరు 21: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-2లో శనివారం ఐఎన్‌టీయూసీ సంబరాలు జరుపుకున్నారు. సింగరేణి లాభాల వాటాను 33 శాతం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యక్షుడు కొటరవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రాజెక్టు పిట్‌సెక్రటరీ రామిండ్ల మనోహర్ సమక్షంలో స్వీట్లను పంపిణీ చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రిశ్రీధర్ బాబు, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఉయ్యాల కుమా రస్వామి, కొమురయ్య, సమ్మిరెడ్డి, రమేశ్, బండ సమ్మయ్య, సత్తన్న, కిష్టయ్య, సదాయ్య, ఉడుత శంకర్, మట్టరాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సహకార స్ఫూర్తిని అందించిన సత్యనారాయణరెడ్డి

- పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్



నివాళులర్పిస్తున్న చైర్మన్ కొత్త శ్రీనివాస్

మంథని, సెప్టెంబరు 21: సహకార సంఘం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసి అందరిలో స్ఫూర్తిని నింపిన మాదాడి సత్యనారాయణరెడ్డి అకాల మరణం తీరని లోటని మంథని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మంథని పీఏసీఎస్ చైర్మన్, కేడీసీసీ బ్యాంక్ ఉపాధ్యక్షుడిగా పని చేసి ఇటీవల మృతిచెందిన సత్యనారాయణరెడ్డి సంతాప సభను స్థానిక పీఏసీఎస్ ఆఫీస్‌లో శనివారం ఏర్పాటు చేశారు. చైర్మన్ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, పాలక వర్గ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, డైరెక్ట ర్లు ఆకుల రాజబాబు,పెద్దిరాజు ప్రభాకర్, లెక్కల కిషన్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి-మొండ య్య, దేవళ్ళ విజయ్‌కుమార్, అజీం, ఆకుల కిరణ్, మూల సరోజన, సీఈవో మామిడాల అశోక్‌లు పాల్గొన్నారు.

'రైతులపై కాంగ్రెస్‌ది కపట ప్రేమ'

పాలకుర్తి, సెప్టెంబరు 21: తెలంగాణలో రైతులపై కాంగ్రెస్ పార్టీది కపట ప్రేమ మాత్రమేనని బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్ హరి అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ తాను శనివారం తలపెట్టిన ధర్నాను పోలీసు బలగాలను మోహరించి అధికార పార్టీ భగ్నం చేసిందన్నారు. తనను హౌజ్ అరెస్టు చేసేందుకు పోలీసులు చేసిన అన్ని ప్రయత్నాలను ఛేదించుకొని మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి చేరుకొని ధర్నా చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించడం దుర్మార్గమైన చర్యగా అన్నారు. కార్యక్రమానికి తనతోపాటు కదిలివచ్చిన మండల ప్రజానికానికి, తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరి పట్టుదలను అభినందించారు. ఏసీపీ గజ్జి కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

'అభివృద్ధిని చూడలేని బీఆర్ఆర్ నాయకులు'

పాలకుర్తి,సెప్టెంబర్ 21: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ నాయకులు కళ్లుండి చూడలేకపోతున్నారని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. శనివారం పాలకుర్తి ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో కేశోరాం కర్మాగారం పర్మినెంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే ఇచ్చిన హామీలు అమలు చేసిందని, రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్ హరి రైతులను, కేశోరాం కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. తన స్వప్రయోజనాల కోసం ధర్నాకు రూపకల్పన చేశాడన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, యూని యన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేణి శ్రీనివాస్‌యాదవ్, పొన్నం సత్తయ్య, వైద్య నరేష్, కుమార్‌గౌడ్, కె వాసుదేవరావు, సీపతి సురేష్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయం వద్ద వాటర్ ట్యాంకు ప్రారంభం



ట్యాంకును ప్రారంభిస్తున్న మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి

ఓదెల, సెప్టెంబరు 21:మండల కేంద్రంలోని చీకటితోట ఆంజనేయ స్వామి ఆలయవద్ద శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి తాగునీటి సౌకర్యాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు విద్యుత్ మోటార్, బోర్ బావి ఏర్పాటు చేయగా చీకటి తోట ఆంజనేయ స్వామి చిన్నజయంతి భక్తులు నీటి ట్యాంక్‌ను నిర్మించారు. ఈ మేరకు భక్తులకు నీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులంతా ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపతి సదానందం, బోడుకుంట స్వామి, నాగపూరి రవి, బోడకుంట శంకర్, ఆకుల మహేందర్, అల్లం సతీష్, వంగ రాజమల్లు, చింతం కుమారస్వామి, వంగ మొండయ్య, పచ్చిమట్ల శ్రీనివాస్, రాపెల్లి రాజయ్య, పిట్టల నర్సింగం, రామినేని రాజేందర్, అనంశెట్టి వెంకటేశం, అప్పని తిరుపతి, మీసుగు సంతోష్, పెండం లక్ష్మణ్, రాకేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ నేతల ఆరోపణలు అవాస్తవం'

మంథని, సెప్టెంబర్ 21: మంత్రి శ్రీధర్‌బాబుపై మంథని బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణలు అవాస్తవమని కాంగ్రెస్ నేతలు ఎరుకల ప్రవీణ్, కుడుదల వెంకన్న, అజీంఖాన్, ఆర్ల నాగరాజులు వెల్లడించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీధర్‌బాబు రాష్ట్రానికి అనేక కంపెనీల పెట్టుబడులు తీసుకువచ్చి రాష్ట్ర, మంథని అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతూ తప్పుచేస్తే ఉపేక్షించేది లేదని, చట్టం తన పని తాను చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో నేతలు మంథని సురేష్, జనగామ నర్సింగరావు, శ్రీకాంత్, సడువలిలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి

సుల్తానాబాద్, సెప్టెంబరు 21 : విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని శనివారం సుద్దాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశాన్ని అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పీఎం షేక్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ ఆజీముద్దీన్ సందర్శించి సూచించారు. పాఠశాలలోని రూమ్ టు రీడ్ లైబ్రరీ, చిన్నపిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆటల రూమును చూసి హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్‌రావు, సదానందం, శ్రీలత, వలంటీర్ మధు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 21: మండలంలోగల మల్యాల ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీజీటీ ఆంగ్లం, పీజీటీ సివిక్స్ పీజీటీ అర్థశాస్త్రం, పీజీటీ తెలుగు పోస్టుల ఖాళీలను భర్తీ చేయడానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుండి ఈనెల 24లోపు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 50శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్, బీఎడ్, టెట్ అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగలరని పాఠశాల ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

గోదావరిఖని, సెప్టెంబర్ 21: భారతీయ జనతా పార్టీ విస్తృతంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం గోదావరిఖనిలో శనివారం నిర్వహించారు. లక్ష్మీనగర్ మండల అధ్యక్షులు కోడూరి రమేష్ ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీనగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మెరుగు హన్మంత్‌గౌడ్, సభ్యత్వనమోదు ప్రముఖ్ క్యాతం వెంకటరమణ, మండల అధ్యక్షుడు కోడూరి రమేష్, గుండబోయిన భూమన్న తదితరులు పాల్గొన్నారు.

రామగిరి : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సభ్యత్వ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై సభ్యత్వ నమోదును ప్రారంభించారు. మంథని నియోజకవర్గం సభ్యత్వ సహాయ ఇన్‌చార్జి మత్స్యగిరి రాము, మండల అధ్యక్షుడు మోల్కారి శ్రీనివాస్, నాయకులు తీగల శ్రీధర్, రాజు, వరలక్ష్మి, శివ, మహేష్, సందీప్, మోహన్, దొంతుల సురేష్, సంపత్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో పంటల పరిశీలన

పాలకుర్తి, సెప్టెంబరు 21: మండలంలోని కుక్కలగూడూర్, పాలకుర్తి, పుట్నూర్, కన్నాల గ్రామాల్లో శనివారం వ్యవసాయశాఖ అధికారులు పంటపొలాలను పరిశీలించారు. రైతులకు బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు పైన అవగాహన కల్పించారు.

కమాన్‌పూర్ : మండలంలోని జూలపల్లి గ్రామంలోని వరి పొలాలను మండల వ్యవసాయాధికారి రామకృష్ణ పరిశీలించారు. రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే పంట దిగుబడిలో ఇబ్బందులు ఉండవని అన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో

జూలపల్లి, సెప్టెంబరు 21: జూలపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి బొద్దుల గంగయ్య తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రజలకు అందుతున్న ప్రజాసేవల గురించి అధికారులను ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. ధరణిలో పెండింగ్ దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈసందర్భంగా ఆర్డీవో గంగయ్యను కార్యాలయ ఉద్యోగులు సన్మానించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ జక్కుని స్వర్ణ, ఆర్ఐ సంజీత్‌రెడ్డి, సీనియర్ సహాయకులు సదయ్య పలువురు ఉన్నారు.

వైభవంగా చతుర్థి వేడుకలు

మంథని, సెప్టెంబరు 21: స్థానిక మంత్రపురి శ్రీమహాగణపతి ఆలయంలో చతుర్థి వేడుకలను భక్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని శ్రీమహాగణపతి స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు పల్లి రాముశర్మ ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజించారు. భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి



ట్రినిటి విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 21 : ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. లక్ష్య దిశలో ప్రయాణం చేసే విద్యార్థులకు ట్రినిటీ సంస్థలు ఎప్పుడు వెన్నంటే ఉంటాయని తగిన ప్రోత్సాహాన్ని అందిస్తాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత స్థితిలోకి ఎదగాలని సందేశాన్ని ఇచ్చారు. అనంతరం విద్యార్థులు అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మెమొంటోలతో సత్కరించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు తమ ఆటపాటలతో అలరింపజేశారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఓదేలు, అనిల్ మరియు అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 21: తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో ఘనుకోట శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దకల్వల, నిమ్మనపల్లి, నిట్టూరు గ్రామాల్లో ఎంపీడీవో, ఎంపీవోలు పర్యటించారు. ఈసందర్భంగా పెద్దకల్వలలో గ్యాస్ సబ్సిడీదారులకు మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ధ్రువపత్రాలను ఇన్‌చార్జి ఎంపీడీవో ఘనుకోట శ్రీధర్, ఎంపీవో ఫయాజ్‌లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామాల్లో శానిటేషన్, పరిశుభ్రత పనులను పరిశీలించారు. వెంట పంచాయతీ కార్యదర్శులు నిశాంత్‌రావు, రాజ్‌కుమార్, శరత్‌బాబు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

ఓదెల, సెప్టెంబరు 21 : మండలంలోని బాయమ్మపల్లెలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు ఎమ్మెల్యే విజయరమణారావుకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికి గ్రామంలో పదిమంది నిరుపేదలకు సొంత ఇండ్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే నిర్మాణం కోసం కృషి చేయాలని కోరారు. గ్రామంలో నీరు నిల్వ ఉండకుండా మురికి కాలువల నిర్మాణం చేపట్టాలని, మురికి కాలువల నిర్మాణం లేకపోవడం వల్ల నీటి నిల్వలు అధికమై జ్వరాలు వస్తున్నాయని, దీంతో ఆసుపత్రుల పాలై గ్రామస్తులు ఆర్థిక నష్టాలకు గురవుతున్నారని తెలిపారు. అలాగే రైతుల కోసం గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు అయిందని, దీనివలన రైతులకు సాగునీరు అందే అవకాశం ఉందని వెంటనే అసంపూర్తిగా ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, గిరాం సాంబమూర్తి, మంద సంపత్ రెడ్డి, మారం లింగారెడ్డి, మంద వైకుంఠం, మారం రవీందర్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌కు సన్మానం

ముత్తారం, సెప్టెంబరు 21: మండలంలోని దర్యాపూర్ మోడల్‌స్కూల్ లోని ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి, 16మంది ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ కావడంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, ముత్తారం మండలం మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముత్తారం మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు దరియాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా యుగేందర్



ఎలిగేడు, సెప్టెంబరు 21: పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా యుగేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో శనివారం పీఆర్టీయూ మండల సమావేశం నిర్వహించారు. పీఆర్‌టీయు రాష్ట్ర కార్యదర్శులు జడల సత్యనారాయణ, రవీందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెల శ్రీధర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా పీఆర్‌టీయు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా మిట్టపల్లి సురేందర్ (ధూళికట్ట), ప్రధాన కార్యదర్శిగా సముద్రాల చంద్రమౌళి, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.ప్రసాద్, మహిళ ఉపాధ్యక్షురాలిగా బూర లావణ్య, కార్య దర్శిగా దేవేందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు హిందీ భాషపై పోటీలు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 21 : మండలం లోని రామపూర్ జడ్పీ ఉన్నతపాఠశాలలో ప్రధా నోపాధ్యాయులు హన్మంతు ఆధ్యక్షతన, జీగురు రవిందర్ ఆధ్వర్యంలో హిందీ భాష దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు హన్మంతు, ఉపాధ్యాయులు రమేష్, లక్ష్మీప్రసూన, రఫత్‌సుల్తానా, శ్రీకర్, రాజు, మంజుల, మాలశ్రీలు పాల్గొన్నారు.

లఘు చిత్ర బృందానికి సత్కారం

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 21: ఇటీవల హైదరాబాద్ అవార్డు అందుకున్న లఘు చిత్ర బృందాన్ని శనివారం గోదావరిఖని మార్కండేయకాలనీలో నియర్‌అండ్ డియర్ ఫ్రెండ్లీ ఆర్గనైజేషన్ సత్కరించింది. సంస్థ అధ్యక్షుడు పీఎస్ అమరేందర్, మూ ల శంకర్, రామిల్ల సర్వేశ్, వేణుమాధవ్, బెండె నాగభూషణం, శ్రీనివాస్, గట్టయ్య పాల్గొన్నారు.

మిషన్‌శక్తి పథకంపై అవగాహన

జూలపల్లి, సెప్టెంబరు 21 : మండలంలోని పెద్దాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులకు కేంద్రం మిషన్‌శక్తి పథకంపై పెద్దపల్లి మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్లు అరుణ, సంధ్యలు అవ గాహన కల్పించారు. మహిళల కోసం పనిచేసే సఖీ కేంద్రం 181 టోల్‌ఫ్రీ నంబరు, దాని సేవలపై సలహాలు వివరించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పాలకుర్తి, సెప్టెంబరు 21: మండలం పరిధి లోని కన్నాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు గౌసియాబేగం తదితరులు పాల్గొన్నారు.